క్లుప్తంగా

ట్రాఫిక్‌లో.. అంబులెన్స్

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లి జీపీ పరిధిలోని శ్రీ కృష్ణప్రసాద్ పశువుల వారంతపు సంత ప్రతీ బుధవారం నిర్వహిస్తారు. అయితే ఈ సంతకు జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచీ వేలాది మంది రైతులు, వ్యాపారులు పశువులు, జీవాలను తీసుకొస్తుంటారు. దీంతో ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారిపై వాహనాలు నిలుపుదల చేయగా.. బుధవారం ట్రాఫిక్ జామ్ అయి అంబులెన్స్ చాలాసేపు ఆగి వెళ్లాల్సి వచ్చింది.

‘బొమ్మ’ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంఅర్బన్: జెఎన్‌టీయూ ప్రకటించిన బీటెక్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని బొమ్మ విద్యాసంస్థల చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులను చైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సత్యప్రసాద్, కార్యదర్శి ఉదార్ శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.భిక్షం, కాలేజీ డీన్ ఎం.కిరణ్‌జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ నియామకాలు

తిరుమలాయపాలెం: మండలంలోని తెట్టెలపాడు గ్రామానికి చెందిన ముగ్గురు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యాన ప్రభుత్వ ఉపాధ్యాయుల నియామక పత్రాలు అందుకున్నారు. గ్రామానికి చెందిన కమర్తపు వెంకటేశ్వర్లు బయోలాజికల్ స్కూల్ అసిస్టెంట్‌గా జిల్లాస్థాయిలో 2వ ర్యాంకు సాధించగా.., గ్రామానికి చెందిన గోకినపల్లి పవిత్ర, మిట్టకోల స్వాతిలు, ఎదుళ్లచెరువు గ్రామానికి చెందిన కాంపాటి సుధాకర్, సంధ్యా ఎస్‌జీటీలుగా నియామక పత్రాలు అందుకున్నారు.

డీఎస్సీ అభ్యర్థుల వినతి



సైదులుకు వినతిపత్రం ఇస్తున్న అభ్యర్థులు

ఖమ్మం సహకారనగర్: టెట్ అర్హత అంశంపై కోర్టులో కేసు ఉన్న కారణంగా డీఎస్సీ–2024 స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో సెలెక్ట్ అయిన తమ ధ్రువీకరణ పత్రాల పరిశీలన, నియామక పత్రాలు ప్రభుత్వం నిలిపి వేసిందని పలువురు అభ్యర్థులు ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ దేవరకొండ సైదులుకు విన్నవించారు. తమ సమస్యను పరిష్కరించేలా చూడాలని అభ్యర్థులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ నాయకులు మన్సూర్, సుధాకర్‌రెడ్డి, పోతగాని వెంకన్న, డీఎస్సీ అభ్యర్థులు పవన్, వీరబాబు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శిగా బాలాజీ

కామేపల్లి: కామేపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు లకావత్ బాలాజీని హైదరాబాద్‌లో జరిగిన 35వ కౌన్సిల్ సమావేశంలో టీఎస్‌పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అభివృద్ధితో పాటు ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని బాలాజీ పేర్కొన్నారు. ఈమేరకు బాలాజీకి మండల అధ్యక్ష, కార్యదర్శి రాములు, వెంకన్న శుభాకాంక్షలు తెలిపారు.

మత్స్య శాఖ చైర్మన్‌ను కలిసిన నాయకులు

నేలకొండపల్లి: తెలంగాణ రాష్ట్ర మత్స్య శాఖ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను ఖమ్మంలో బుధవారం మండలానికి చెందిన నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మత్స్య శాఖకు ప్రభుత్వం అందించే పథకాలను నేలకొండపల్లికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బోయిన వేణు, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, నాయకులు యడవల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాంకు నివాళి

ఖమ్మం మామిళ్లగూడెం: బీఎస్పీ వ్యవస్థాపకుడు మాన్యశ్రీ కాన్షీరాం 18వ వర్ధంతిని బుధవారం బీఎస్పీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను పలువురు నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి నాగేశ్వరరావు, నాగరాజు, విజయకుమార్, కర్రి కృష్ణ, ఉపేందర్‌సాహు, శ్రీనివాస్, నాగేశ్వరరావు, వంశీ, కోటయ్య, పూలే, వెంకటేశ్వర్లు, జకరయ్య, సతీష్, రాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దేవర
వినోద	దేవర
సాయిరాం	స్వాగ్
ఆదిత్య	జోకర్, దక్షిణ రాంనగర్ బన్ని
శ్రీనివాస	సత్యం సుందరం

– ఖమ్మంగాంధీచౌక్

సద్దుల సంబరాలు షురూ..

బతుకమ్మను పూలతో పేర్చి ఆటపాటలతో సాగుతున్న సంబరాలు నేడు(గురువారం) సద్దుల బతుకమ్మతో ముగియనున్నాయి. చప్పట్లలో జానపదాల పాటలు, ఆటల కలయికతో పోయిరావమ్మ, మళ్లీ రావమ్మ బతుకమ్మ అంటూ ఊరూవాడా అంగరంగ వైభవంగా జరుపుకునేందుకు మహిళలంతా సిద్ధమయ్యారు. పుట్టింట్లో ఈ వేడుకలు జరుపుకోవడం అనాదిగా వస్తుండడంతో ఇళ్లన్నీ మహిళలు, పిల్లలతో కళకళలాడుతున్నాయి.

– ఖమ్మంగాంధీచౌక్

మార్కెట్‌లో పూలకు పెరిగిన గిరాకీ

- రంగులద్ది విక్రయాలు
- ఐదు రకాల నైవేద్యంతో పూజలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన పాలకులు
- నేటితో ముగియనున్న బతుకమ్మ వేడుకలు



రంగులద్దిన పూలను కొనుగోలు చేస్తున్న నగరవాసులు

సాగనంపేందుకు సిద్ధం..

పుట్టిన ఊరిలో స్నేహితులు, బంధువులతో కలిసి 10 రోజుల పాటు ఆనందంగా గడపడానికి మహిళలు ఎంతో ఇష్ట పడతారు. సద్దుల బతుకమ్మను అంగరంగ వైభవంగా జరుపుకునేందుకు పరిసర ప్రాంతాలు, పచ్చిక బయళ్లలో పూలు కోసుకొచ్చి బతుకమ్మలను పేర్చే పనిలో ఆడబిడ్డలు నిమగ్నమయ్యారు. కొత్త దుస్తులు ధరించి బతుకమ్మలతో బ్యాండ్ మేళాలు, డీజే సౌండ్స్, కోలాటాల నడుమ సమీప దేవాలయాలు, జలాశయాల వద్దకు చేరుకొని గౌరమ్మను పూజిస్తూ బతుకమ్మను సాగనంపేందుకు ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేసుకున్నారు.

జోరుగా విక్రయాలు..

పండుగలో చివరి రోజైన సద్దుల బతుకమ్మను వైభవంగా జరుపుకోవడం కోసం మహిళలు పూల సేకరణలో నిమగ్నమయ్యారు. ఇందుకోసం తంగేడు, గునుగు, తామర, టేకు పూలను తీసుకొచ్చి బతుకమ్మను పేర్చుతుండగా.. మరికొందరు బంతి పూలను వినియోగిస్తున్నారు. ఈనేపథ్యాన కొందరు గ్రామీణ ప్రాంతాల వారు అడవుల నుంచి వివిధ రకాల పూలను సేకరించి పట్టణాలకు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. కారేపల్లి, కామేపల్లి, ఇల్లెందు, ఏన్కూరు, తిరుమలాయపాలెం, రఘునాథపాలెం, చింతకాని, కొణిజర్ల తదితర ప్రాంతాల నుంచి పూలను తీసుకువచ్చి నగరంలో అమ్ముతున్నారు.

ఐదు రకాల నైవేద్యాలు..

బతుకమ్మ సంబరాల్లో ప్రతి రోజూ నైవేద్యాల సమర్పన ఉన్నప్పటికీ సద్దుల బతుకమ్మ రోజున మాత్రం ఐదు రకాల నైవేద్యాలను సమర్పించనున్నారు. ఇందులో పెరుగన్నం, చింతపండు పులిహోర, కొబ్బరన్నం, నువ్వులన్నం అనే ఐదు రకాలు తయారు చేస్తారు. బతుకమ్మను కొలుస్తూ పూలతో పాటు నైవేద్యాలను సమర్పించడం తెలంగాణ ప్రజల సంప్రదాయం.

డిమాండ్‌కు తగ్గట్టుగా ధరలు..

తంగేడు పూలను బతుకమ్మలో తప్పక పేర్చాల్సి ఉండడంతో ఆ పూలకు బాగా గిరాకీ ఉంది. 5 కట్టలను రూ.100ల చొప్పున విక్రయిస్తున్నారు. ఇక గునుగు, టేకు వంటి పూలు 10 కట్టలు రూ.100 చొప్పున పలుకుతుండగా.. బంతి, సీత జడ వంటి పూలు మాత్రం కిలో రూ.100 చొప్పున అమ్ముతున్నారు. ఇక భారీ బతుకమ్మలను పేర్చడం కోసం మేదర బుట్టలను సైజును బట్టి రూ.100 నుంచి రూ. 500ల వరకు విక్రయిస్తున్నారు.



సీతజడ పూలను కొనుగోలు చేస్తున్న మహిళ



బతుకమ్మలను పేర్చే బుట్టల విక్రయం

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

బతుకమ్మ వేడుకల్లో భాగంగా బుధవారం వెన్నముద్దల బతుకమ్మలను సంప్రదాయ పద్ధతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు, పిల్లలు బతుకమ్మ పాటలతో కోలాటాలు, నృత్యాలు చేసి అలరించారు. దీంతో వీధులు, ఆలయాలు కళకళలాడాయి.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంగాంధీచౌక్: శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో నృత్యాలు చేస్తున్న మహిళలు, యువతులు, పిల్లలు



ఖమ్మంఅర్బన్: కొత్తగూడెంలో ఆటపాటలతో సందడి చేస్తున్న మహిళా సంఘం నాయకులు



ఖమ్మం మామిళ్లగూడెం: బీకే బజార్‌లో వీరనారీమణుల ఆశయ సాధన సమితి సభ్యులు



కామేపల్లి: బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య



సర్దార్ పటేల్ స్టేడియంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ బతుకమ్మ

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు..

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి, వాటి యజమానులకు నోటీసులు ఇవ్వాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కమిషనర్ తన చాంబర్‌లో అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి శానిటేషన్ సూపర్‌వైజర్, ఎస్‌ఐలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నీరు నిలిచి, ముురుగు, పిచ్చి మొక్కలతో ఉన్న ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇవ్వాలని, అయినా వారు స్పందించకుంటే కార్పొరేషన్ ఆధ్వర్యాన శుభ్రం చేయించి, సంబంధిత ఖర్చులతో పాటు మరో రూ.5వేలు అదనంగి విధించి యజమానుల నుంచి వసూలు చేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన యజమానులపై తెలంగాణ మున్సిపల్ యాక్ట్ 2019 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్

ఆర్థిక సాయం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం పట్టణానికి చెందిన టూవీలర్ మెకానిక్ ఆడెపుజాని అనారోగ్యంతో ఇటీవల ఆపరేషన్ చేయించుకుని ఇంటికే పరిమితమయ్యాడు. దీంతో తమ వంతు సాయంగా ఖమ్మం కార్పొరేషన్ టూవీలర్ మెకానిక్ యూనియన్ సభ్యులు బుధవారం రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వంగాల కొండలరావు మాట్లాడుతూ.. యూనియన్‌లో ప్రతీ ఒక్క మెకానిక్ సభ్యత్వం కలిగి ఉంటే ఎప్పుడు ఏ ఆపద వచ్చినా సహకరించడానికి వీలుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, శివరామకృష్ణ, మురళి, రమేష్, శ్రీను, బ్రహ్మం, శేషు, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

‘మతం పేరుతో కాలయాపన’

ఖమ్మంమయూరిసెంటర్: గత పదేళ్ల మోదీ పాలనలో మానవుల ఆత్మస్థైర్యం దెబ్బ తీశారని, దేశ ప్రగతిని మరిచి మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతూ కాలయాపన చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్ ఆరోపించారు. బుధవారం నగరంలోని బైపాస్ రోడ్ కూరగాయల మార్కెట్‌లో కూరగాయల మార్కెట్ రిక్షా వర్కర్స్ యూనియన్ సీపీఎం శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ చేసి దేశాన్ని ఆర్థికంగా దివాళా తీసేందుకు మోదీ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. రాబోయే కాలంలో బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా జరిగే రాజకీయ ఆందోళనలో పార్టీ శ్రేణులు, మద్దతుదారులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు జెల్లా ఉపేందర్, కోరే బీరప్ప, మోటే స్వామి, బి. ప్రభాకర్, నర్సయ్య, బి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

కూసుమంచి: తమ మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువాయిగూడెం ప్లాంట్‌లో పనిచేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు బుధవారం ధర్నాకు దిగారు. దీంతో ప్లాంట్ పరిధిలోని 60 గ్రామాలకు తాగు నీటి సరఫరా నిలిచిపోయింది. పని చేసినా జీతాలు రాకపోవడంతో పండుగ పూట కూడా తాము పస్తులుండాల్సి వస్తుందని వాపోయారు. ఎల్‌అండ్‌టీ కంపెనీ యాజమాన్యంతో పాటు అధికారులు స్పందించి తమ వేతనాలు విడుదల చేయించాలని, లేకుండా వేతనాలు విడుదల చేసే వరకూ విధులకు హాజరు కాకుండా తాగునీటి సరఫరాను నిలిపివేస్తామని హెచ్చరించారు. దీంతో వేతనాలు చెల్లింపులో ఎలాంటి అవాంతరాలు లేకుండా చూస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

తిరుమలాయపాలెం: పేదలకు రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ పీవీ రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్‌లో రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వాలు అందిస్తున్న రేషన్ బియ్యాన్ని సక్రమంగా వినియోగించుకునేలా డీలర్లు కృషి చేయాలని, బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాకు రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ నరసింహారావు ఆర్‌ఐలు వీరయ్య, లహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు.. అన్నదానాలు..



ఖమ్మంగాంధీచౌక్: శ్రీ స్తంభాద్రి ఆలయంలో సరస్వతీ దేవి అవతారంలో అమ్మవారు

శ్రీదేవి నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు బుధవారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఉత్సవ కమిటీల ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో భక్తులకు పూజా సామగ్రి అందించగా.. ఆలయాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



నేలకొండపల్లి: శ్రీ ఉత్తరేశ్వరస్వామి దేవాలయంలో అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం



ఖమ్మంరూరల్: నడిమితండా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న తుంబూరు దయాకర్‌రెడ్డి



ఖమ్మంఅర్బన్: 6వ డివిజన్ ప్రశాంతినగర్‌లో సరస్వతి పూజలో పాల్గొన్న విద్యార్థులు



కామేపల్లి: బర్లగూడెంలో అన్నదానం..



తిరుమలాయపాలెం: ఎదుళ్లచెరువులో అన్నదానం

సంఘం సేవలు అభినందనీయం



భోజనశాలను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంమయూరిసెంటర్: కమ్మ మహాజన సంఘం ప్రాంగణంలోని స్వర్ణభారతి కళ్యాణమండపంలో రూ.27 లక్షలతో ఆధునీకరించిన భోజనశాలను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవ చేస్తూనే సంఘ అభివృద్ధికి కృషి చేస్తున్న సంఘ పెద్దలకు అభినందనలు తెలిపారు. వరదల సమయాన స్వర్ణభారతి కళ్యాణ మండపాన్ని పునరావాస కేంద్రంగా ఏర్పాటు చేసి సేవా గుణాన్ని చాటుకుందన్నారు. కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు ఎర్నేని రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సంఘ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి గొడవర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు..

ఖమ్మంగాంధీచౌక్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం నగరంలోని గుట్టలబజార్‌లో ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మేళ్లచెరువు వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన వేద పండితులు మంత్రికి ఆశీర్వచనం పలికారు. డాక్టర్ బులుసు అపర్ణ రచించిన పద్య యుగళగీతాన్ని కపిలవాయి అచ్చుత్‌కుమార్ వినిపించారు.

ఎరువులు, విత్తనాలు ఎమ్మార్పీకే విక్రయించాలి

నేలకొండపల్లి: ఎరువులు, విత్తనాలు ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే చర్యలు తప్పవని కూసుమంచి సహాయ వ్యవసాయ సంచాలకురాలు బి.సరిత హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో విత్తన, ఎరువుల డీలర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. విత్తనాలు అధీకృత కంపెనీలకు చెందిన వాటిని మాత్రమే విక్రయించాలని, పురుగు, కలుపు మందులు విక్రయించేటప్పుడు డీలర్లు రైతులకు సూచనలు చేస్తూ విక్రయించాలని సూచించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి దేశబోయిన అరుణకుమారి, డీలర్లు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, గెల్లా వెంకటేశ్వరరావు, రామలక్ష్మడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నిరసన

ఖమ్మం మామిళ్లగూడెం: డీఎస్సీ ఉద్యోగ నియామకాలలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా తెలంగాణ ముఖ్యమంత్రి దేశ అత్యున్నత స్థానం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరుపై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన బుధవారం నల్ల బాడ్జీలతో నిరసన తెలిపింది. ఈమేరకు ఖమ్మం జెడ్పీసెంటర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. వర్గీకరణ చేసేంత వరకు డీఎస్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జాతీయ నాయకుడు ఏపూరి వెంకటేశ్వరావు, ఎంఎస్పీ రాష్ట్ర, జాతీయ నాయకులు బచ్చలకూర వెంకటేశ్వరావు, తూరుగంటి అంజయ్య, కూరపాటి సునిల్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం..

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ఫొటోగ్రఫీ అధ్యక్షుడిగా ఎన్నికైన జిల్లాకు చెందిన ఎస్.కె. హుస్సేన్‌ను బుధవారం మంచికంటి భవనంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి నూతనంగా ఎన్నికైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి, రాష్ట్ర కోశాధికారి భూమిడి మాధవరెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గాదె లింగమూర్తి, రాష్ట్ర మాజీ వైస్ ప్రెసిడెంట్ వేముల నరసింహారావు, రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శులు కన్నెగొండ్ల అశోక్, మారగాని వెంకట్, జిల్లా ప్రధాన కార్యదర్శి మద్రేల నాగేశ్వరరావు, జిల్లా కోశాధికారి కె.శ్రీనివాసరావు, గౌరవ సలహాదారులు ఉస్మాన్ తదితరులు పాల్గొని అభినందించారు. కాగా, కార్యక్రమానికి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు వేములూరి నాగరాజు దేవర అధ్యక్షత వహించగా.. రాబోయే మూడేళ్లలో ఫొటోగ్రాఫర్ల అభివృద్ధికి కృషి చేస్తానని హుస్సేన్ తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరద బాధితులకు నెస్ట్లీ కంపెనీ ఆధ్వర్యాన నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. బుధవారం కరుణగిరి ప్రాంతంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ వారికి నిత్యావసర కిట్లను అందజేశారు.

గుండెపోటుతో వృద్ధురాలి మృతి

నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరుకు చెందిన మంగమ్మ (60) అనే వృద్ధురాలు బుధవారం గుండెపోటు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇవ్వగా.. ఆలస్యం కావడంతో ఆటోలో స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. 108ను స్థానికంగా ఉంచాలని పలువురు ప్రభుత్వాన్ని కోరారు.

విప్లవానికి దిక్సూచి చేగువేరా

ఖమ్మంమయూరిసెంటర్/రఘునాథపాలెం/తిరుమలాయపాలెం: సామ్రాజ్యవాద వ్యతిరేక తిరుగుబాటు విప్లవానికి దిక్సూచి చే గువేరా అని ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శులు నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ కొనియాడారు. ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో చే గువేరా 57వ వర్ధంతి సభ నిర్వహించారు. చే గువేరా చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. అణచివేతపై గెరిల్లా పోరాటాలు నడిపి స్వాతంత్ర్య ఫలాలు అందించిన ప్రపంచ విప్లవ వీరుడు చే గువేరా అని అన్నారు. కార్యక్రమంలో మేకల శ్రీనివాసరావు, జ్వాల నరసింహారావు, మద్దోజు శ్రావణ్, శివనాయక్, కౌశిక్, పవన్, బాలాజీ, సాయి, నరేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, రఘునాథపాలెం మండలంలోని చిమ్మపుడిలో బుధవారం డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చే గువేరా వర్ధంతిని నిర్వహించగా.. చింతల రమేశ్, జైపాల్, నజీర్, నవీన్, లోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే, తిరుమలాయపాలెంలో గజ్జల వెంకటయ్య భవనంలో డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చేగువేరా వర్ధంతిని నిర్వహించారు. బషీరుద్దీన్, దాసరి మహేందర్, దిండు మంగపతి, కొమ్ము శీను, తుళ్లూరు నాగేశ్వరరావు బింగి రమేశ్, వేగినాటి వెంకట్రావు, ఉపేందర్‌రెడ్డి, వెంకటేశ్, స్వామి, వెంకన్న, లింగస్వామి పాల్గొన్నారు.



మయూరిసెంటర్: చేగువేరా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు